సాక్షి
వికారాబాద్

గురువారం । 4 । జనవరి । 2024



మౌలిక వసతులు కల్పిస్తాం

ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తెచ్చి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



నిరుపయోగంగా..

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. 8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఉన్నత స్థాయికి ఎదగాలి

డీఈఓ రేణుకాదేవి



మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

బంట్వారం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని డీఈఓ రేణుకాదేవి ఆకాంక్షించారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చని అన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభా కర్, జెడ్పీటీసీ సంతోష, ఎంఈఓ చంద్రప్ప, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరలారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైరవీలకు తావులేదు

గ్యారంటీల అమలుకే ప్రజాపాలన

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ప్రజాపాలనలో పైరవీలకు తావులేకుండా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 25వ వార్డు మినీ భూకైలాస్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు స్కీమ్‌లు అమలు చేశామని తెలిపారు. మరో నాలుగు పథకాలను త్వరలో అమలు చేస్తామన్నారు. అందులో భాగంగానే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కౌన్సిలర్లు రత్నమాల నర్సింహులు, రవిరాజ్, భీం సింగ్ రాథోడ్, మధుబాల, మాజీ కౌన్సిలర్లు నర్సింహులు, మల్లికార్జున్, పీ.బస్వరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కొందుర్గు: గురుకుల పాఠశాల విద్యార్థులకు భోజనం అందిస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు వెంటనే చెల్లించాలని కంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ భూ పాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్ రావు, ఉపాధ్యక్షుడు దుర్గని శ్రీనివాస్, సెక్రటరీ నల్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఫీ‘జులుం’

వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ ఫీజుల కోసం ఒత్తిళ్లు

- నిబంధనలకు విరుద్ధంగా నాలుగింతల వసూళ్లు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ
- ఎక్కడా కనిపించని ప్రభుత్వ ఫీజు చార్టు
- జిల్లాలో 185 ప్రైవేటు పాఠశాలలు, 45వేల మంది విద్యార్థులు



వికారాబాద్: ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమవుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు వసూలు చేయాల్సి ఉన్నా ఎవరికి తోచిన రీతిలో వారు వసూలు చేస్తున్నారు. పాఠశాలల్లో స్లిప్ టెస్టులు మొదలుకొని సమ్మెటీవ్, ఫార్మెటీవ్ వరకు ఏ పరీక్ష నిర్వహించినా యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాయి. అడిగినంత ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాయిస్తున్నారు. లేదంటే గంటల తరబడి క్లాస్ బయట నిలబెడుతున్నారు. ప్రిన్సిపాల్‌ను కలవాలని పంపుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం లేదు. ఒకవేళ పాఠశాలను తనిఖీ చేసినా విద్యార్థులతో గాని వారి తల్లిదండ్రులతో గాని మాట్లాడిన పాపాన పోవడం లేదు. డీఈఓ కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ కింది స్థాయి ఉద్యోగి ప్రైవేటు పాఠశాలల నుంచి డబ్బుల వసూళ్లు చేస్తున్నాడనేది బహిరంగ రహస్యం. అందుకే విద్యాశాఖ అధికారులు ఫీజుల గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అధికారికంగా 190ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిలో 46,000 మంది పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఫీజుల నియంత్రణలో విఫలం

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పోటీ పడి ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఇంటర్, డిగ్రీలో ఆయా గ్రూపులకు సంవత్సరానికి రూ. 10వేల నుంచి రూ.18 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.లక్షకు పైగా వసూలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఎల్‌కేజీకే రూ. 40వేలకు పైగా దండుకుంటున్నారు. ఎస్–1, ఎస్ –2, ఎఫ్ –1, ఎఫ్ –2, ఎఫ్ –3, ఎఫ్ –ఫోర్ తదితర పరీక్షలు నిర్వహించే ప్రతిసారీ ఫీజుల కోసం విద్యార్థులను పీడిస్తున్నారు. ప్రభుత్వ ఫీజుకు పది రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ యాజమాన్యాలు ఫీజుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు.

ఫీజు చార్టు ఇలా..

చివరగా 2018 –19 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాశాఖ ఫీజు చార్టును విడుదల చేసింది. అయితే యాజమాన్యాలు ఇవేవీ పాటించడం లేదు. ఫీజు చార్టు ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో అయితే నెలకు రూ. 650, సంవత్సరానికి 7,800 వసూలు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.750, ఏడాదికి రూ. 9వేలు తీసుకోవాలి. ఉన్నత పాఠశాల స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.900, ఏడాదికి రూ.10,800, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.1000, ఏడాదికి రూ.12,000 తీసుకోవాలి. అయితే ఈ ఫీజులకు 10శాతం అధికంగా వసూలు చేస్తున్నారు. ఎవరైనా తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే హడావుడి చేసి ఆ తరువాత పట్టించుకోవడం లేదనేది వాస్తవం.

మౌలిక వసతుల కల్పనకే ‘పీఎం జన్మాన్’

- ఈ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

పెద్దేముల్: గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మాన్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చైతన్యనగర్ (చెంచు కాలనీ)లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గిరిజనులకు పథకం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం జన్మాన్ పథకం ద్వారా ప్రతి గిరిజన కుటుంబం మౌలిక వసతులు పొందవచ్చని సూచించారు. ఈ పథకం ద్వారా 11రకాల సౌకర్యాలు పొందే అవకాశం ఉందని, జిల్లాలోని 22 ఆవాసాల్లో 776 కుటుంబాలకు ఈ పథకం ద్వారా సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. మొదటి ప్రాధాన్యతగా వ్యక్తిగత సౌకర్యాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యుత్, మంచి నీటి వసతి లేని ఇళ్లు, పంట రుణాలు పొందని వారితో జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ కార్డు ఎంత మందికి లేదో చెప్పాలన్నారు. 40మందికి కార్డులు లేవని కాలనీ వాసులు చెప్పారు. 24గంటల్లో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కుల ధ్రువీకరణ పత్రాలు, పంట రుణాలు, బ్యాంక్ ఖాతాలు, విద్యుత్, మంచినీటి వసతికి సంబంధించిన పూర్తి వివరాలను వారం రోజుల్లో తమకు అందజేయాలని ఆదేశించారు. పోడు భూములకు సంబంధించిన సమస్యలు లేకుండా చూడాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి రైతుకూ కిసాన్ క్రెడిట్ కార్డులు అందేలా చొరవ తీసుకోవాలన్నారు. 2005 డిసెంబర్ కంటే ముందు పోడు భూములను సాగు చేసుకుంటున్న వారి జాబితాను సిద్ధం చేయాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ లలిత, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, డీఎంహెచ్ఓ పల్వన్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, డీఈఓ రేణుకాదేవి, వివిధ శాఖల అధికారులు లలితాకుమారి, కిషన్, బుచ్చిబాబు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరస్కరణకు గురికావొద్దు

ప్రజాపాలనకు వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తిరస్కరణకు గురికాకుండా చూడాలని, అలాగే రసీదు కూడా ఇవ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం పెద్దేము ల్ మండలం బుద్దారం గ్రామంలో జరిగిన ప్రజా పాలన గ్రామ సభను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డు కోసం తెల్ల కాగితంపై దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తెల్ల కాగితంపై దరఖాస్తు చేసిన వారికి రసీదు ఇవ్వక పోవడంతో ఎంపీడీఓ లక్ష్మప్పపై కలెక్టర్ మండిపడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహాలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకునే వారు 18నుంచి 57 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. పింఛన్లు పొందని వారు మాత్రమే అర్హులన్నారు. సొంత ఇల్లు లేని వారు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లలితకుమారి, ఎంపీడీఓ లక్ష్మప్ప, సర్పంచ్ లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, ఈఓఆర్‌డీ రమేష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఏపీఓ నర్సింలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మీనాక్షి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఏఎన్‌ఎం నర్సుబాయి తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డిలో జమ్మికుంట పుర పంచాయితీ

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసమే కారణం

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం
- స్థానికంగా ఉద్రిక్త వాతావరణం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన లొల్లి
- ఫిర్యాదు చేసుకున్న ఇరువర్గాలు

కొత్తూరు: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై పెట్టి న అవిశ్వాసం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో బుధవారం రాజకీయ గొడవకు దారి తీసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగడం సంచలనంగా మారింది. ఇరు పార్టీల నాయకులు వందలాదిగా కౌన్సిలర్లు ఉన్న ఫాంహౌస్ వద్దకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసుల రంగప్రవేశం.. చర్చలతో పరిస్థితి సద్దుమణిగింది. వివరాలివీ.. ప్రస్తుతం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్న రాజేశ్వర్‌రావుపై ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పొన్నగంటి మల్లయ్య వర్గం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా మల్లయ్య తనకు అనుకూలంగా ఉన్న వారిని మంగళవారం హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఓ హోటల్‌లో క్యాంపు కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ప్రస్తుత చైర్మన్, అతడి వర్గీయులు క్యాంపు నుంచి ఒక కౌన్సిలర్‌ను బయటకు రప్పించి తమతో తీసుకెళ్లారు. అవిశ్వాస తీర్మానానికి ఇంకా సమయం ఉండడం.. క్యాంపు ప్రాంతాన్ని బీఆర్‌ఎస్ నేతలు తెలుసుకోవడంతో మల్లయ్య వర్గం షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులను సంప్రదించింది. దీంతో కొత్తూరు మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి ఇన్ముల్‌నర్వ సమీపంలోని వైఎంతండా దగ్గర ఉన్న ఓ ఫాంహౌస్‌లో అదేరాత్రి వారికి బస ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న చైర్మన్, అతడి అనుచరులు అర్ధరాత్రి ఫాంహౌస్ వద్దకు వచ్చి గేటు తెరవాలని గొడవ చేయగా వారు మాజీ జెడ్పీటీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో శ్యాంసుందర్‌రెడ్డి ఉదయం ఫాంహౌస్ వద్దకు బయలుదేరాడు. దారిలో కార్లు కనిపించడంతో వారిని వివరాలు అడిగే క్రమంలో వాగ్వాదం మొదలైంది. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కుమారుడు, కేశంపేట ఎంపీపీ రవీందర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు విడివిడిగా పెద్ద సంఖ్యలో ఫాంహౌస్ వద్దకు చేరుకున్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకొచ్చారని ఆరోపిస్తుండగా కాంగ్రెస్ నాయకులు పోలీసుల సమక్షంలో కౌన్సిలర్ల వద్దకు తీసుకెళ్లగా తమ ఇష్టంతోనే క్యాంపుకు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ క్రమంలోనే గేటు బయట ఇరువర్గాల నాయకులు తమ వారికి అనుకూలంగా నినాదాలు చేస్తూ నెట్టుకున్నారు. ఇంతలో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

నటన ఆపి నిజాలు మాట్లాడాలి

జమ్మికుంట కౌన్సిలర్లు తమ ఇష్టంతోనే ఫాంహౌస్‌కు వచ్చినట్లు మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు రఘు, మల్లయ్య తెలిపారు. ఇవేవీ తెలుసుకోకుండా తాము ప్రస్తుత చైర్మన్ రాజేశ్వర్‌రావును హత్య చేయడానికి సుపారీ తీసుకున్నామని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. నిజంగా బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకొస్తే చట్ట ప్రకారం పోలీసులకు ఫిర్యాదు చేసి ఫాంహౌస్‌కు రావాలన్నారు. అంతేతప్ప అర్ధరాత్రి ఫాంహౌస్‌కు వచ్చి ఎందుకు రెక్కీ నిర్వహించారని నిలదీశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు వాస్తవాలు దాచి ప్రజలను, పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

పోలీసులు చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై దాడి చేసిన కాంగ్రెస్ నేత శ్యాంసుందర్‌రెడ్డితో పాటు పలువురిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావుతో పాటు పలువురు కొత్తూరు సీఐ నర్సింహారావుకు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకొచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్లాస్మా వాటర్స్, హార్ట్‌ఫుల్ నెస్‌ల సహకార ఒప్పందం

నందిగామ: యూఎస్ అగ్రి–టెక్ కంపెనీ ప్లాస్మా వాటర్ సొల్యూషన్ ఇంక్, భారతీయ అనుబంధ సంస్థ, ప్రముఖ గ్లోబల్ ఎన్‌జీఓలలో ఒకటైన హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కాన్హా శాంతి వనంలోని హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రంలో బుధవారం ఇరు సంస్థల ప్రతినిధులు వంశీ చలగుల్లా, రాబర్ట్ హార్ట్ సమక్షంలో ఒప్పందం కుదిరినట్లు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ పీఆర్‌ఓ చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆహార భద్రతను అత్యంత స్థిరమైన పద్ధతిలో ప్రారంభించడం, భారత దేశం నుంచి మిగిలిన ప్రపంచానికి హరిత విప్లవం 2.0ను పరిచయం చేయడం అనే ఉమ్మడి ప్రయోజనాన్ని ప్రోత్రహించడానికి ఈ రెండు సంస్థలు సహకార ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్మా వాటర్ సొల్యూషన్ ఇంక్ ప్రెసిడెంట్, సీఈఓ రాబర్ట్ హార్ట్ మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలగకుండా మొక్కల ఆరోగ్యం, నేల ఆరోగ్యం, నీటి ఆరోగ్యాన్ని పెంపొందించే పద్ధతుల్లో రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఆహార ఉత్పాదకత, రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

దిగుబడి భళా.. ధర డీలా..

- జిల్లా వ్యాప్తంగా 2.51లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- 2లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 70వేల మెట్రిక్ టన్నులు
- ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020
- బహిరంగ మార్కెట్‌లో రూ.6,580
- రెండో దశ మద్దతు ధర రూ.6,920



యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ జిన్నింగ్ మిల్లుకు చేరిన పత్తి

తాండూరు: కాలం కలిసి వచ్చింది. పత్తి పంట సాగు చేసిన రైతులకు దిగుబడులు ఆశజనకంగా వస్తున్నాయి. పత్తికి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని, ధర బాగా పలుకుతుందని రైతులు ఆశ పడ్డారు. దీంతో గతేడాది కంటే ఈ సారి అధిక విస్తీర్ణంలో పంటను సాగు చేశారు. రెండు నెలల నుంచి పత్తిని మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత సీజన్‌లో క్వింటాలు పత్తికి రూ.9 వేల నుంచి రూ.13 వేల వరకు ధర పలికింది. అయితే ఈ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వ మద్దతు ధర రూ.6,920 నుంచి రూ.7,020కు మించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

14 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో ప్రధాన పంటగా పత్తి సాగవుతోంది. 20 మండలాల్లో 2.51లక్షల ఎకరాల్లో తెల్ల బంగారాన్ని పండిస్తున్నారు. ప్రభుత్వం పత్తి పంటను ప్రోత్సహించడంతో సంప్రదాయ పంటలకు స్వస్తి పలికారు. కొన్ని మండలాల్లో పత్తి దిగుబడులు బాగా వచ్చాయి. క్వింటాలు పత్తికి ప్రభుత్వం రూ.7,020 మద్దతు ధర నిర్ణయించింది. సీసీఐ ఆధీనంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తిని సేకరిస్తున్నారు. సీసీఐ ద్వారా డిసెంబర్ 31వ తేదీ వరకు 34,270 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ప్రైవేటుగా 35,651 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు పత్తికి కనిష్ట ధర రూ.6,400.. గరిష్ఠ ధర రూ. 6,750, సగటు ధర రూ.6,580 చొప్పున చెల్లిస్తున్నారు.

కొన్నది 70వేల మెట్రిక్ టన్నులు

గత ఖరీఫ్‌తో పోల్చితే ఈ ఏడాది పత్తి సాగు పెరిగింది. 2.51లక్షల ఎకరాల్లో పంటను సాగు చేశారు. 2లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 7వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. దీంతో 40 శాతం పత్తి మార్కెట్‌కు చేరింది. ఇంకా 60 శాతం రైతుల వద్దే ఉంది. డిసెంబర్ నెలాఖరు వరకు బీబీ మోడ్ రకం పత్తి క్వింటాలుకు రూ.7,020 చెల్లించారు. జనవరి నుంచి రెండో దశలో వచ్చే పత్తి పింజ రకం క్వింటాలుకు 6,920 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. గత నెల కంటే క్వింటాలు పత్తిపై రూ.100 తక్కువగా మద్దతు ధర లభించనుంది. రానున్న రోజుల్లో పత్తి ధర కొంత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. దీంతో ప్రభుత్వ మద్దతు ధర కంటే ప్రైవేటు ద్వారానే జిల్లాలో కొనుగోళ్లు జోరుగా సాగుతుండటం గమనార్హం.

దళారులను నమ్మొద్దు



గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోల్చితే ఈ ఏడాది వానాకాలం పంటలు ఆశజనకంగా ఉన్నాయి. పత్తి చివరి దశలో కొంత వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తర్వాత వానలు పడటంతో సమస్య తొలగిపోయింది. ఎకరాకు 10నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. రైతులు దళారులను నమ్మి మోసపోరాదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో మాత్రమే పత్తిని విక్రయించాలి.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

40శాతం కొనుగోలు



జిల్లాలో 2లక్షల మెట్రిక్ టన్నుల పత్తి సేకరణే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 40శాతం (70వేల మెట్రిక్ టన్నులు) సేకరించాం. రెండో దశలో ఎక్కువ శాతం కొనుగోలు చేస్తాం. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పత్తిని కొనుగోలు చేస్తాం. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో క్వింటాలు పత్తికి రూ 6,500వరకు చెల్లిస్తారు.

– సారంగపాణి, మార్కెటింగ్ మేనేజర్

రాజకీయాలకు అతీతంగా ‘గ్యారంటీలు’

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



బంట్వారంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

బంట్వారం: రాజకీయాలకు అతీతంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. తెల్ల రేషన్ కార్డు లేని వారు కూడా ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రాబోతుందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నాటి సంక్షేమ పాలనను తీసుకొస్తామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ధనిక రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. ప్రజలపై రూ.5 లక్షల కోట్ల భారం వేసిందని అన్నారు. పేదింటి ఆడ పిల్ల పెళ్లికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.60లక్షలు ఇస్తుందని తెలిపారు. అర్హులు ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బంట్వారం, కోట్‌పల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బంట్వారం, కోట్‌పల్లి ఎంపీపీలు ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, బంట్వారం జెడ్పీటీసీ సంతోష, ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్లు ప్రవీణ్ కుమార్, ఆశాజ్యోతి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశం, నర్సింగ్ నాయక్, స్థానిక సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ పద్మ, సుల్తాన్‌పూర్ సర్పంచ్ నర్సింలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



మహిళా టీచర్లను సన్మానిస్తున్న శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: తొలి ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిపూర్ ప్రాథమిక పాఠశాల మహిళా ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ప్రఖ్యాతి గాంచిన సావిత్రీబాయి పూలే బాలికల చదువు కోసం సొంత ఖర్చుతో పాఠశాలలను స్థాపించారన్నారు. మహిళాభ్యున్నతి కోసం ఆమె నిరంతరం పాటు పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, విద్యారాణి, మంజుశ్రీ, గంగ తదితరులు పాల్గొన్నారు.

నాగ్యనాయక్‌కు సన్మానం



నాగ్యనాయక్‌ను సన్మానించిన సభ్యులు

మర్పల్లి: మర్పల్లి రైల్వే స్టేషన్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైల్లు ఆపేందుకు కృషి చేయాలని రైల్వే శాఖ పీసీఓఎం అధికారి నాగ్యనాయక్‌కు ఇంటర్ సిటీ మండల సాధన సమితి కమిటీ సభ్యులు కోమరి వెంకటేశం, పాండునాయక్, శేఖర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మర్పల్లి రైల్వే స్టేషన్‌కు పీసీఓఎం అధికారి నాగ్యనాయక్ వస్తున్న విషయం తెలుసుకున్న పలువురు ఇంటర్ సిటీ సాధన సమితి సభ్యులు రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఆయనను ఘనంగా సన్మానించారు. మర్పల్లి రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లే ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన నాగ్యనాయక్ ఈ విషయమై దక్షిణ మధ్య రైల్వేబోర్డు సమావేశంలో సభ్యుల దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. మర్పల్లి రైల్వే స్టేషన్‌లో బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ఇంటర్ సిటీ రైలు ఆపే విధంగా సహకరించి మండల ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన పీసీఓఎం నాగ్యనాయక్‌కు స్థానకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ సిటీ సాధన సమితి సభ్యులు పాండునాయక్, శేఖర్, రమేష్ మిత్ర తదితరులు ఉన్నారు.

మాకు న్యాయం చేయండి

భర్త ఇంటి ఎదుట భార్య, కొడుకు నిరసన



కృష్ణ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న మంగ, వంశీ తదితరులు

మంచాల: తమకు న్యాయం చేయాలని ఓ తల్లి, కొడుకు తండ్రి ఇంటి ఎదుట నిరసనకు దిగిన సంఘటన మంచాల మండల పరిధిలోని జాపాలలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు వంశీ కథనం ప్రకారం.. ఇరవై ఏళ్ల క్రితం జాపాలకి చెందిన నోముల కృష్ణ అనే వ్యక్తి మాఅమ్మ (మంగమ్మ)ను వివాహం చేసుకున్నాడు. వివాహానంతరం గొడవపడి దూరంగా ఉన్నారు. నాకు ఇరవై సంవత్సరాల వయసొచ్చింది. మా అమ్మ అనారోగ్యానికి గురైంది. ఇప్పుడు మా నాన్న కృష్ణ వేరొక మహిళను పెళ్లి చేసుకొని మాకు అన్యాయం చేశాడు. వంశీకి మద్దతుగా వారి అమ్మమ్మ కుటుంబ సభ్యులు నిలిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కృష్ణ ఇంటిముందు నిరసన తెలిపారు. కృష్ణ, మంగ వివాహానికి సంబంధించిన కేసు ఇంకా కోర్టులో నడుస్తోంది. ఈవిషయమై ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

మౌలిక వసతులు కల్పిస్తాం

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- కోటబాసుపల్లి జీపీ భవనం ప్రారంభం



తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: ప్రభుత్వం నుంచి పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోటబాసుపల్లిలో రూర్బన్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ లిమిట్‌ను రూ.10 లక్షలకు పెంచామన్నారు. ప్రజాపాలన కార్యక్ర మంలో దరఖాస్తులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిశీలించి అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. అనంతరం సర్పంచ్ కుర్వ నాగర్జునను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనితగౌడ్, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, జెడ్పీటీసీ మంజుల, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు వీరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాందాస్, మొగులప్ప, పంచాయతీ కార్యదర్శి లాలప్ప ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు

తాండూరు రూరల్: పార్టీలకు అతీతంగా పనిచేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్కాపూర్, కోత్లాపూర్, కోటబాసుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ అనుచరులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించిందని.. కాంగ్రెస్ పార్టీ మాత్రం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ రవిసింధే, నాయకులు జనార్దన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పండరి, బోయిని నర్సింహులు, మల్లేశం, మహబూబ్ ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి..

- చెరువులో మృతదేహమై తేలాడు
- దోమ మండలం రాకొండలో విషాదం



చెరువులో నుంచి మృతదేహాన్ని తీస్తున్న స్థానికులు

దోమ: చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాకొండకి చెందిన ఎండీ యూనుస్ (45) ఈనెల 1వ తేదీన గ్రామ సమీపంలోని చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. అయితే ఎంతకీ తిరిగిరాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కోట్‌పల్లి మండలం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి వారి సహాయంతో మంగళవారం చెరువు మొత్తం గాలింపు చేసినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం ఎట్టకేలకు చెరువులో శవం తేలుతూ స్థానికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య పర్వీన్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోవడం కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. యూనుస్‌కు ముగ్గురు కుమార్తెలే ఉండటంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

మోమిన్‌పేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకొవాలని హెచ్‌డబ్ల్యూఓ జైపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవర 31వ తేదీ దరఖాస్తులకు చివరితేదీ అన్నారు. ఆధార్ కార్డు, ఆదాయం, కులం, బోనఫైడ్, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్సు కాపీలను జతచేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



నీటూరులోని క్రీడాప్రాంగణం

దౌల్తాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే మంచి లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ఉపాధి హామీ పనుల కింద ఈ ప్రాజెక్టు చేపట్టారు. ఒక ఎకరం స్థలంలో ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని అందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, కబడ్డీ కోర్టులు, లాంగ్‌జంప్ పిట్‌లతో పాటు వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. వీటితో పాటు చుట్టూ ఫెన్సింగ్ మాదిరిగా కానుగ, వెదురు, తంగెడు మొదలగు మొక్కలు పెంచాలని నిర్ణయించారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో అవి ఎక్కడా కూడా కార్యారూపం దాల్చడంలేదు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రస్తుతం అవి రైతులకు పంట నూర్పిళ్లకు తదితర పనులకు ఉపయోగపడుతున్నాయి. ప్రతి గ్రామంలోనూ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. నూతన ప్రభుత్వం ఆయా ప్రాంగణాలను క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

అప్‌డేట్ అవస్థలు

కిటకిటలాడుతున్న ఆధార్ కేంద్రాలు

- పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలంటున్న కేంద్రం
- ప్రభుత్వ పథకాలకూ తప్పనిసరి అంటున్న అధికారులు
- సెంటర్లు పెంచాలంటున్న ప్రజలు



షాద్‌నగర్‌లోని ఆధార్ సెంటర్ వద్ద క్యూలైన్



కేంద్రం బయట క్యూలో చెప్పులు పెట్టిన దృశ్యం

కొందుర్గు: దేశంలోని ప్రతి వ్యక్తికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది. ప్రభుత్వం ఏ పథకం ప్రారంభించినా ఆధార్‌కార్డును అనుసంధానం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలలో విద్యార్థిని చేర్పించాలన్నా, విద్యార్థికి ఉపకారవేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా, రైతులకు పంట రుణాలు, రైతుబంధు అందుకోవాలన్నా, మహిళలు పొదుపు సంఘాల్లో చేరాలన్నా, ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం చేయాలన్నా, వృద్ధులు పింఛన్ పొందాలన్నా.. ఇలా పుట్టిన శిశువు మొదలు వ్యక్తి జీవితాంతం, చివరకు మరణించిన అనంతరం మరణ ధృవ పత్రం పొందాలన్నా ఆధార్ తప్పనిసరిగా మారింది. ఇంత ప్రాముఖ్యత గల ఆధార్ కార్డు కేంద్రాలు జిల్లాలోని అన్ని మండలాల్లో, ప్రధాన పట్టణాల్లో లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

అప్‌డేట్ చేయాల్సిందే..

పుట్టిన శిశువుకు ఆధార్‌కార్డు తీసుకున్న అనంతరం ఐదేళ్ల తదుపరి ఆధార్ అప్‌డేట్ చేయాలి. అదేవిధంగా ప్రతి పదేళ్లకోసారి ఆధార్ అప్‌డేట్ చేస్తేనే వేలిముద్రలు సరిపోయి ఆధార్ ఐడెంటిఫికేషన్ సునాయాసంగా ఉంటుంది. ఆధార్‌లో ఏదైన మార్పిడి చేయాలన్నా, ఫోన్‌నంబర్ జతచేయాలన్నా, మహిళలు అయితే తండ్రి పేరు స్థానంలో భర్తపేరు చేర్చాలన్నా ఆధార్ అప్‌డేట్ చేయాల్సిందే. ఇక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకావడం, జిల్లాలు, మండలాలు, నూతన గ్రామపంచాయతీలు ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో ప్రతి వ్యక్తి ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం దరఖాస్తులను తీసుకుంటున్న నేపథ్యంలో ఆధార్ అప్‌డేట్ లేకపోతే తమకు పథకాలు అందవేమో అని ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ కోసం సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

అర్ధరాత్రి నుంచే క్యూలైన్..

షాద్‌నగర్ ఆధార్ సెంటర్ వద్ద అర్ధరాత్రి నుంచే ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. రాత్రి సమయంలో క్యూలైన్‌లో చెప్పులు పెట్టి తెల్లవారగానే క్యూలో నిలబడుతున్నారు. గంటలతరబడి లైన్‌లో ఉండి ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్నారు. కొందుర్గు మండలంలో ఒక్క ఆధార్ సెంటర్ కూడా లేకపోవడంతో మండలవాసులు షాద్‌నగర్, చించోడ్‌తోపాటు వికారాబాద్ జిల్లా పరిగి, చిట్యాలకు వెళ్తున్నారు. అక్కడ వెళ్లి గంటల తరబడి నిలబడినప్పటికీ ఏదైన సాంకేతిక లోపం ఏర్పడితే ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో మళ్లీ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతి మండలంలో జనాభా ప్రాతిపదికన రెండు నుంచి ఐదు ఆధార్ సెంటర్లు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

గంటల తరబడి లైన్‌లో..



కొందుర్గు మండలంలో కనీసం ఒక్క ఆధార్ సెంటర్ కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అప్‌డేట్ కోసం ఇంటినుంచి పొద్దుగాలే లేచి షాద్‌నగర్‌కు వెళ్తున్నాం. మేము అక్కడికి వెళ్లేసరికి పెద్ద సంఖ్యలో లైన్‌లో ఉంటున్నారు. గంటల తరబడి లైన్‌లో నిలబడి ఇంటికి వస్తున్నాం. నాలుగైదు గ్రామాలకు ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

– వెంకటయ్య, చుక్కమెట్టు, కొందుర్గు

ఎందుకింత నిర్లక్ష్యం



ప్రజలు ఆధార్ సెంటర్ల వద్ద అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రజలు పనులు మానుకొని ఆధార్ సెంటర్ల వద్ద అర్ధరాత్రి నుంచే క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి ఐదువేల జనాభాకు ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటుచేయాలి. ఆధార్ సెంటర్లు ఏర్పాటుచేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తొలగడంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుంది.

– జంగయ్య, సీపీఐ నాయకుడు, కొందుర్గు

ప్రతి హామీని నెరవేరుస్తాం

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... పేదలకు లబ్ధి జరగాలన్నా, రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, మండల ప్రత్యేకాధికారి సరళాదేవి, ఎంపీడీఓ నాగవేణి, సర్పంచ్ లక్ష్మి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్–బి అధ్యక్షుడు భరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, నాయకులు స్వామి, భాస్కర్, కృష్ణయ్య, సోమలింగం, షర్ఫుద్దీన్, వెంకటేశ్, నర్సింహులు, చంద్రయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు విశేష స్పందన

ఆర్డీఓ శ్రీనివాసరావు



తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం ఐదోరోజు కొనసాగింది. బుధవారం దరఖాస్తులు సమర్పించేందుకు తాండూరు నియోజకవర్గ పరిధిలో ప్రజలు పోటెత్తారు. ప్రతి మండలంతో పాటు మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల సమక్షంలో సభలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. తాండూరు నియోజవకర్గంలోని నాలుగు మండలాలు, తాండూరు మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలకు మంచి స్పందన వస్తోంది. బుధవారం వరకు నియోజవకర్గ వ్యాప్తంగా 49,786 కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించామని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఇప్పటివరకు 138 వార్డులు, గ్రామాల్లో సభలు నిర్వహించారు. తాండూరు మున్సిపాలిటీలో 11,834 దరఖాస్తులు, బషీరాబాద్ మండలంలో 10,240, పెద్దేముల్ మండలంలో 7,535, తాండూరు మండలంలో 10,936, యాలాల మండలంలో 9,241 చొప్పున దరఖాస్తులు అందాయని ఆర్డీఓ తెలిపారు. బుధవారం ఒకేరోజు 8,755 దరఖాస్తులను స్వీకరించారు.

గడువు పెంపు

రాయదుర్గం: మనూలో దూరవిద్య కోర్సుల రిజిస్ట్రేషన్ గడువును పొడిగించడం జరిగిందని డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం జనవరి 10వ తేదీ వరకు అవకాశం ఉందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్

మంచాల: అర్హులందరూ ప్రజాపాలనలో అభయ హస్తం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పాడు, ముకునూర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం కోసం ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణ ఎలా చేస్తున్నారు, దరఖాస్తులను ప్రజలకు అందుబాటులో ఉంచారా, దరఖాస్తులు నింపేందుకు వలంటీర్లు, సిబ్బంది ప్రజలకు సహకారం అందిస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రిజిస్టర్ నమోదు వంటి అంశాలను కూడా పరిశీలించారు. రేషన్‌కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అనుమతులు రద్దుచేయండి

కప్పాడు గ్రామసభకు వచ్చిన అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌ను గ్రామ పంచాయతీ పాలక వర్గం, రైతులు కలిసి.. ఎల్మినేడ్ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేస్తున్న రైస్‌మిల్లు అనుమతులు అడ్డుకోవాలని కోరారు. మొదట్లో రైస్ గోదాం ఏర్పాటు చేస్తామని నమ్మించి రైస్‌మిల్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైస్‌మిల్లు ఏర్పాటుతో వచ్చే వ్యర్థాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే గాకుండా పక్కనే గల చెరువు కలుషితమవుతుందన్నారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, సర్పంచ్ హంసమ్మ, ఉపసర్పంచ్ మునీర్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు శ్వేత, వార్డుసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కార్గో రూట్‌లో మెట్రో రైలు

- డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సీఎం ఆదేశం
- హర్షం వ్యక్తం చేస్తున్న జల్‌పల్లి, మామిడిపల్లి వాసులు



మామిడిపల్లి నుంచి విమానాశ్రయానికి కొనసాగుతున్న రహదారి పనులు

పహాడీషరీఫ్: మెట్రో రైలును శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించడానికి ప్రభుత్వం మొగ్గు చూపుతుండడంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెట్రో రైలు రెండో దశ విస్తరణలో భాగంగా మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జల్‌పల్లి–మామిడిపల్లి కార్గో రోడ్డులో కొత్త అలైన్‌మెంట్ విషయమై ప్రత్యేకంగా చర్చించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలోనే ఈ రూట్‌లో మెట్రో రైలు కారిడార్‌పై చర్చ జరిగినప్పటికీ.. అది ముందుకు సాగలేదు. ప్రస్తుతం పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు కారిడార్‌ను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి పట్టుదలతో ఉండడం.. దీనికి అనుసంధానంగా ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట, బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి మీదుగా పి–7 కార్గో రోడ్డులో లక్ష్మీగూడ, వాంబేకాలనీ, జల్‌పల్లి, మామిడిపల్లి మీదుగా 23 కిలోమీటర్ల పొడవులో ఈ లైన్‌కు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో తమ ప్రాంతానికి మహర్దశ పట్టనుందన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

అనువుగా రోడ్డు

మైలార్‌దేవ్‌పల్లిలోని ఒరంగడ్డ నుంచి మామిడిపల్లి వరకు 150 ఫీట్ల విస్తీర్ణంలో పి–7 కార్గో రోడ్డు నిర్మాణమై ఉంది. రోడ్డు మధ్యలో ఏకంగా 50 ఫీట్ల కంటే అధికంగా డివైడర్ ఉండడంతో అదనంగా స్థల సేకరణ అవసరం లేనందున మెట్రో నిర్మాణానికి ఖర్చు సైతం తక్కువ అవుతుందన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ రూట్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. విమానాశ్రయానికి వెళ్లే వాహనదారులు, గూడ్స్ వాహనాలు ట్రాఫిక్ సమస్య లేకుండా సులభంగా చేరుకోవాలన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 2007లో పి–7 కార్గో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. 150 ఫీట్ల విస్తీర్ణంలో ప్రారంభమైన పనులు అప్పట్లోనే మామిడిపల్లి వరకు పూర్తయ్యాయి. తాజాగా మామిడిపల్లి వివేకానంద విగ్రహం నుంచి రూ.29.50 కోట్ల వ్యయంతో సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ పక్కనున్న నాగలక్ష్మమ్మ కంచె మీదుగా విమానాశ్రయం వరకు కొనసాగుతున్న పనులు తుది దశకు చేరుకున్నాయి.

వెలుస్తున్న వెంచర్లు

మైలార్‌దేవ్‌పల్లి నుంచి మామిడిపల్లి వరకు ఇప్పటికే పెద్ద ఎత్తున విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ నివాసాలు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాలు రూపుదాల్చుకుంటున్నాయి. ఐరా, కాసాగ్రాండ్, ఫినిక్స్, శ్రీనిధి, ప్రిస్టేజీ లాంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ సంస్థలు ఈ రహదారికిరువైపులా భారీ వెంచర్లలో నిర్మాణాలు చేపట్టాయి. వీటితో పాటు మామిడిపల్లి కొండలలో పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు కూడా కొలువుదీరుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఈ రూట్‌లో మెట్రో రైలు వచ్చినట్లయితే ఇక్కడి వాసులకు రవాణా సదుపాయం ఎంతో వెసులుబాటుగా మారనుంది. ఈ ప్రాంతంతో ఎంతో అనుబంధంగా ఉన్న పాతబస్తీకి వాణిజ్య, సందర్శనీయ అవసరాలకు వెళ్లే ప్రజలకు కూడా మెట్రో సౌకర్యవంతంగా మారే అవకాశాలున్నాయి. పరిసర ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి.

ప్రయాణం సులభతరం



శంషాబాద్ విమానాశ్రయానికి మామిడిపల్లి, జల్‌పల్లి మీదుగా మెట్రో రైలు నిర్మాణానికి ప్రభుత్వం మొగ్గు చూపడం ఎంతో సంతోషకరం. విమానాశ్రయాన్ని ఆనుకొని ఉన్న తమ గ్రామ ప్రజలు ఇకపై నగరానికి చేరుకోవాలంటే సులభతరం కానుంది. ఒకప్పుడు విమానాశ్రయ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు.. మెట్రోలాంటి సదుపాయాలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి.

– ఎద్దు వాసుదేవారెడ్డి, మామిడిపల్లి

అక్రమ వెంచర్ కూల్చివేత



హిమాయత్‌నగర్‌లో అనుమతులు లేని నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు

మొయినాబాద్‌రూరల్: అక్రమంగా వెంచర్ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ సమీపంలో గల సర్వే నంబర్ 145లో అక్రమ వెంచర్ నిర్మాణాలు జీఓ 111కు విరుద్ధంగా చేపడుతున్న వాటిని జేసీబీతో కూల్చివేశారు. హిమాయత్‌నగర్ సమీపంలో ఉన్న ఈ వెంచర్‌కు గతంలో రెండుసార్లు నోటీసులు ఇచ్చామన్నారు. అయినా తమ మాటలను బేఖాతరు చేస్తూ పనులు సాగిస్తుండగా కూల్చివేశామన్నారు. మళ్లీ పనులు నిర్వహిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [H-42904]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ. 18 K. ఫోన్: 9640258899 / 9640468899. [H-793668]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్ భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12597]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.